క్లుప్తంగా

పంట నష్టం అంచనాలు పూర్తి చేయాలి

కపిలేశ్వరపురం: తుపాన్ ప్రభావంతో కేదారి లంక, వీధివారిలంకల్లో ఉద్యాన పంటల నష్టం అంచనాను త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, పీఏసీఎస్ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు అధికారులను కోరారు. తుపాన్ ప్రభావం వీడగానే పంటల నష్టాన్ని అంచనా వేయాలని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించడం, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంబంధిత అధికారులకు సూచనలు చేయడం పట్ల లంక గ్రామాల ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలి



రాయవరంలో క్రిస్మస్ సందేశమిస్తున్న ఇమ్మానుయేల్ రాజు

రాయవరం: స్థానికంగా ఆదివారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవ మత బోధకుడు సత్తి మహిమానందరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుక జరిగింది. ఈ వేడుకల్లో పెద్దాపురం బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ జీఆర్ ఇమ్మానుయేల్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని వాక్య సందేశమిచ్చారు. క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ఏసుక్రీస్తు ప్రపంచానికి ప్రేమ, శాంతి మార్గాలు అందించాలన్నారు. యూత్ సభ్యులు క్రీస్తును ఆరాధిస్తూ ఆలపించిన క్రైస్తవ గీతాలు అలరించాయి.

సాబ్జీ మృతి తీరనిలోటు

కపిలేశ్వరపురం: ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండపేట నియోజకవర్గంలో ప్రజా సంఘాలు చేసిన ఉద్యమాలు, సమావేశాల్లో సాబ్జీ విశేషంగా పాల్గొన్నారన్నారు. ప్రజా ఉద్యమాలను కొనసాగించడం ద్వారా సాబ్జీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

ఆరో రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

రామచంద్రపురం: కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, అంగనవాడీ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గ, వి.వీర లక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీల 6వ రోజు నిరవధిక సమ్మెలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ స్టాలిన్ సమ్మె శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల మీద ప్రభుత్వం స్పందించి సమ్మెని త్వరగా విరమింప చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అంగనవాడీ జిల్లా మెంబర్ వాసంశెట్టి సూర్య కుమారి, మండల అధ్యక్షుడు కె.విజయలక్ష్మి, జి.శ్రీదేవి, సెక్టర్ లీడర్స్ కె.జహీరా, కె.దుర్గ, జి.వెంకటరత్నం, గొంతి దేవి, వీరవేణి, సత్యవతి, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



బహుమతి కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త వీరబ్రహ్మం

రామచంద్రపురం: గణిత పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త కె.వీరబ్రహ్మం పేర్కొన్నారు. వీఎస్ఎం కళాశాలలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి గణిత పోటీల బహుమతి ప్రదానంలో ఆయన ప్రధానవక్తగా పాల్గొన్నారు. రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. రామానుజన్ గణిత అవార్డును ప్రొఫెసర్ ఎంవీ రమణమూర్తి, సంజీవరాయశర్మ గణిత అవార్డును బీవీ పాపారావు, కృష్ణమూర్తి స్మారక ఉపాధ్యాయ అవార్డును డాక్టర్ అడ్డూరి నరసింహమూర్తి అందుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. రామానుజన్ నేటి తరానికి ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి, గణిత ప్రయోగశాల రూపకర్త చంద్రశేఖర శాస్త్రి, గణిత అవధాని తోటకూర సాయి రామకృష్ణ, రవిశంకర్, నాగార్జున వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముందుకు సాగుతున్నారు..

- రబీ పనుల్లో రైతులు బిజీబిజీ
- వేగంగా వరి నాట్లు
- నెలాఖరుకు పూర్తి చేయాలంటున్న అధికారులు



వరి నాట్లు వేసేందుకు దమ్ము చేసి పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

రాయవరం: రబీకి రైతన్నలు సిద్ధమయ్యారు.. ఖరీఫ్ పంట పూర్తి కావడంతో రబీ దిశగా ముందుకు 'సాగు'తున్నారు.. వాతావరణం అనుకూలించడంతో పనులు వేగవంతం చేశారు. వ్యవసాయ శాఖ కూడా డిసెంబర్ నెలాఖరులోగా వరి నాట్లు పూర్తి చేయాలని సూచించడంతో ఈ ఏడాది రబీ పనులను ముందుగానే ప్రారంభించారు. ఇప్పటికే బోర్లపై సాగు చేసే చోట రైతులు వరి నాట్లు పూర్తి చేస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో రబీ వరి సాగును రైతులు చేపడుతున్నారు.

1.01 లక్షల ఎకరాల్లో సాగు

క్లస్టర్ పరిధి మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 1.01 లక్షల ఎకరాల్లో రైతులు రబీ వరి సాగు చేస్తున్నారు. రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో నాట్లు ఊపందుకుంటున్నాయి. అధిక శాతం రైతులు ఎంటీయూ 3626 (బొండాలు) రకాన్ని సాగు చేస్తుండగా, దీనితో పాటు 1001, 1010, 1121, 1156, నెల్లూరు సన్నాలు తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. అధిక శాతం రైతులు బొండాల సాగుకే మొగ్గు చూపుతున్నారు.

వెదజల్లుకు ప్రాధాన్యం

ఇదిలా ఉంటే సాధారణ పద్ధతిలో వరినాట్లు వేసుకోవడం కన్నా వెదజల్లు సాగుకే ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వెదజల్లు విధానంలో సాగు చేయడం వల్ల సమయం ఆదా కావడమే కాకుండా దుబ్బు చేసుకుని తెగుళ్లను తట్టుకుంటుందని, ముఖ్యంగా సమయం ఆదా అవుతుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. రబీలో వెదజల్లు పద్ధతిలో వరి నాట్లు వేసుకుంటే దిగుబడిలో కూడా మంచి ఫలితం వస్తుందని అంటుంది. సాధారణ పద్ధతిలో వరి నాట్లకే ప్రాధాన్యమిస్తున్న రైతులు వరి నారుమడులను సిద్ధం చేసుకున్నారు. వెదజల్లు సాగులో మూడుసార్లు కలుపు మందు వేయాల్సి వస్తుందని, దీనివల్ల భూసారం దెబ్బతింటుందని రైతులు అంటున్నారు. అలాగే వెదజల్లు వల్ల ఖరీఫ్‌లో చేలో మిగిలి ఉన్న వరి గింజలు మొలకెత్తి కేళీలుగా వస్తున్నాయని, సాధారణ పద్ధతిలో వరినాట్లు వేసుకుంటే కేళీల ఇబ్బంది ఉండదని కొందరు చెబుతున్నారు. అయితే వ్యవసాయ శాఖ మాత్రం వెదజల్లుకే ప్రాధాన్యమివ్వాలని వివరిస్తుంది.

ముురగదమ్ము చేయాలి



"వెదజల్లు సాగు చేసే రైతులు సాలుకు సాలుకు మధ్య వారం రోజులు గడువు ఉంచాలి. దీని వల్ల ఖరీఫ్ చేలో మిగిలిన పాత విత్తనాలు మొలకెత్తి రెండో దమ్ములో మట్టిలో కలిసే అవకాశం ఉంటుంది. తద్వారా కేళీలను నియంత్రించవచ్చు. ఈ నెలాఖరులోగా నాట్లు పూర్తి చేసుకోవాలి."

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

షష్ఠి ఉత్సవం చూసొద్దాం రండి

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యేశ్వరుని దివ్య కల్యాణం



రాయవరం మండలం సోమేశ్వరంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దివ్య కల్యాణం

రాయవరం: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి ఉత్సవాలకు ఆ స్వామివారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈ వేడుకలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి, వెంటూరులో ఉమా సమేత సోమేశ్వర స్వామి, రాయవరంలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, చెల్లూరులో బాలాత్రిపుర సుందరీ సమేత అగస్తేశ్వరస్వామి, పసలపూడి, మాచవరం, వెదురుపాక గ్రామాల్లోని శివాలయాల్లో షష్ఠి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం రాత్రి స్వామివారి దివ్య కల్యాణాన్ని పలు ఆలయాల్లో శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాయవరం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణం జరిపారు. సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం అనంతరం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహాలకు వార్షిక శాంతి కల్యాణం చేశారు. రాయవరంలో బొడ్డు భువనేశ్వరకుమార్, బొడ్డు రాంబాబు, కాశీవిశ్వనాథం, శ్రీరామచంద్ర మూర్తి, వెంకన్నబాబు దంపతులు పీటలపై కూర్చుని పూజాదికాలు చేశారు. అనంతరం భక్తులకు కల్యాణ తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

షష్ఠికి సర్వం సిద్ధం

రామచంద్రపురం రూరల్: మండలంలో సోమవారం నిర్వహించనున్న సుబ్రహ్మణ్య షష్ఠికి ఆలయాలు సిద్ధమయ్యాయి. దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంలో ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, వెల్లలో వేంచేసిన సోమేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి దేవాలయంలో ఉపాలయంగా ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వద్ద నరసాపురపుపేట ఆలయంలో వద్ద సుబ్రహ్మణ్య షష్ఠికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



గొల్లపాలెంలో షష్ఠి మహోత్సవాలకు సిద్ధమవుతున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం



హసన్‌బాదలో రథాన్ని సిద్ధం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హసన్‌బాదలో..

హసన్‌బాదలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం నిర్వహించనున్న షష్ఠి వేడుకల్లో భాగంగా రథోత్సవానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక అలకంరణలు చేసి రథాన్ని సిద్ధం చేశారు. ఏర్పాట్లలో ఆలయ ధర్మకర్త సామంచి సత్యనారాయణ మూర్తి, కమిటీ సభ్యులు చోడిశెట్టి భద్రరావు, బొల్లం సత్తిరాజు, చెక్కా చినసోమరాజు, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండలంలోని కాజులూరు, గొల్లపాలెం, ఆర్యావటం, ఉప్పుమిల్లి, పెనుమళ్ల, కె గంగవరం మండలంలోని కోటిపల్లి, పామర్రు, దంగేరు, గంగవరం, తామరపల్లి గ్రామాల్లో సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. ఆదివారం రాత్రి మొదలుకుని మంగళవారం రాత్రి వరకూ వల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వార్లకు కల్యాణం, షష్ఠి మహోత్సవాలు జరుగుతాయి. ఇందులో బాగంగా ఆలయాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దిన నిర్వాహక కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణాల్లో చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో రమణీయంగా అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆర్కెస్ట్రా, చెంచునాటకం, కోలసంబరం, చింతామణి నాటకం, బుర్రకథ, వంటివి ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

మండలంలోని కాజులూరు, గొల్లపాలెం, ఆర్యావటం, ఉప్పుమిల్లి, పెనుమళ్ల, తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం రాత్రి భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించి ప్రధాన వీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. స్థానిక గ్రామాలకు చెందిన భక్తులు ఆలయాల్లో స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అవిశ్రాంత సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేటలో రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): ఉద్యోగ విరమణ చేసినా శేష జీవితంలో సేవా కార్యక్రమాలను చేస్తూ జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న మండపేట రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. మండపేట నాళంవారి సత్రంలో అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి హాజరయ్యారు. అసోసియేషన్ కార్యదర్శి గోవిందరావు సంఘ వార్షిక కార్యక్రమాలను వివరించారు. ఆలమూరు ఎస్‌టీఓ హైదర్ అలి పాషా మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 75 ఏళ్ల వయస్సు పూర్తి చేసుకున్న 14 మంది రిటైర్డ్ ఉద్యోగులను ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి, అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నేమాని భాస్కరరావు, పర్వతిని భాస్కరరావు, విప్పర్తి విశ్వాసరావు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో సమాఖ్య ఆధ్వర్యంలో సత్కారం పొందిన రిటైర్డ్ ఉద్యోగులు

సామాజిక అభ్యున్నతికి సహకరించాలి

రామచంద్రపురం: సామాజిక అభ్యున్నతి కృషికి రిటైర్డు ఉద్యోగులు సహకరించాలని వారి అనుభవాలు, సలహాలు సమాజానికి ఎంతో తోడ్పడతాయని వక్తలు అన్నారు. పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సమాఖ్య కార్యాలయం ఆవరణలో ఆదివారం పెన్షనర్స్ డే ఘనంగా నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు పట్నాల రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభలో గౌరవ అధ్యక్షుడు వి.కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.రాఘవ రాజు, ఆర్థిక కార్యదర్శి పీవీఎస్ ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ శాస్త్రి, భ్రమరేశ్వరరావు, కేవీ చౌదరి తదితరులు మాట్లాడారు. ముందుగా విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వ పింఛన్ సదుపాయానికి చట్టబద్ధత కల్పనకు అవిశ్రాంతంగా పోరాడిన డా.ధరమ్ స్వరూప్ నకారా, చట్టబద్ధత కల్పించేందుకు అనుగుణంగా తీర్పునిచ్చిన అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1948, 49 సంవత్సరాల్లో జన్మించిన వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన 45 మంది రిటైర్డు ఉద్యోగులను సమాఖ్య సాదరంగా దుశ్శాలువాలతో సత్కరించింది.

పూజ చేయగ.. పులకించగ

- ఘనంగా ధనుర్మాస పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు



అంగరలో శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తీర్థపు బిందెతో అర్చకుడు

కపిలేశ్వరపురం: ధనుర్మాసం ఆరంభమైంది.. ప్రతి ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది.. ఆదివారం నియోజకవర్గంలో ధనుర్మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నవ జనార్దన ఆలయాల్లో నాలుగు ఆలయాలు మండపేట నియోజకవర్గంలోనే ఉన్నాయి. మండపేటలో ఐదో జనార్దనుడు భోగముద్రలో, కపిలేశ్వరపురంలో ఆరో జనార్దనుడు పద్మాసన ముద్ర, మాచరలో ఏడో జనార్దనుడు జ్వాలాముద్రలో, కోరుమిల్లిలో ఎనిమిదో జనార్దనుడు సాధక ముద్రలో దర్శనమిచ్చారు. తెల్లవారు జామున వేద పండితులు ఆలయాల కోనేరు నుంచి తీర్థం బిందెలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలిరాగా స్వామివార్లకు అభిషేకం చేశారు. సంక్రాంతి వరకూ ధనుర్మాస పూజలు కొనసాగుతాయని ఆయా ఆలయాలతో పాటు అంగరలోని వేణుగోపాలస్వామి, వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాల అర్చకులు తెలిపారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో వెలసిన ధనమ్మతల్లి ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు సందర్శించారు. ధనమ్మ మర్రిగా ప్రసిద్ధి చెందిన ప్రాంతంలో భక్తులు అమ్మవారి సేవలో తరించారు. కపిలేశ్వరపురంతో పాటు కొత్తపేట, అయినవిల్లి, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. అంగరలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి శ్రవణా జన్మ నక్షత్ర పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారిని విశేషంగా అలంకరించారు. స్వామికి పంచామృతాభిషేకం చేశారు.

హరిదాసుల సందడి ప్రారంభం

రాయవరం: పవిత్ర ధనుర్మాసం వచ్చేసింది. ఆదివారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కావడంతో పలుచోట్ల వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద తిరువీధి నిర్వహించారు. రాముడిపై కీర్తనలు పాడుతూ గ్రామాల్లో హరిదాసులు సందడి చేస్తున్నారు. ప్రజలకు, విష్ణుమూర్తికి రాయబారులుగా ఉన్న హరిదాసుల ఆగమనం సంక్రాంతి సంబరాల శోభకు సంకేతంగా నిలిచింది. ఒక చేత చిడతలు పట్టుకుని మరో చేత్తో తంబుర వాయిస్తూ, ఆకర్షణీయమైన వస్త్రాలంకరణతో హరినామ స్మరణ చేస్తూ వీధివీధినా హరిదాసులు ధనుర్మాసం నెలరోజుల పాటు సందడి చేయనున్నారు.



రాయవరంలో హరిదాసుకు అక్షయపాత్రలో బియ్యం పోస్తున్న భక్తురాలు

పూర్వ విద్యార్థుల కలయిక



మలికిపురంలో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మలికిపురం: గత 30 ఏళ్ల క్రితం స్థానిక ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఎన్ఆర్‌వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో 1986–89లో డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. గ్రూప్ అడ్మిన్ కుడుపూడి బేబీ పద్మకుమారి ఆధ్వర్యంలో కె.వీర స్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన పూర్వ విద్యార్థులు తమ ఆనందాలను వ్యక్తం చేశారు. గత మూడేళ్ల నుంచి తాము కలుసుకుంటున్నట్లు తెలిపారు. తమ బ్యాచ్‌లోని సభ్యులంతా కలసి కొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎఫ్‌డీటీ సంస్థ అందరికీ దేవాలయం లాంటిదని ఇందులో చదువుకున్న వారంతా ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. చదువుతోనే ఈ అభివృద్ధి సాధ్యమైందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించి వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలన్నారు. అనంతరం వినోద కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక జూనియర్ కళాశాల, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.సతీష్, శ్రీనివాసరాజు, గ్రూప్ అడ్మిన్ కుడుపూడి బేబీ పద్మకుమారిలను సమావేశంలో శాలువా, పూల దండ, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రూపు భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో గ్రూప్ ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ కేఎస్‌సీ ప్రసాద్, కె.వెంకటరత్నం, కె.మహేష్, పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విజేతగా వెంకటరమణ

రాజోలు: నరసాపురం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోటరీజోన్–4 స్పోర్ట్స్ మీట్‌లో చెస్ పోటీల్లో విజేతగా రాజోలు రోటరీక్లబ్ సభ్యురాలు యెనుముల వెంకటరమణ విజేతగా నిలిచారు. ఆదివారం ఈ మేరకు ఆమెను రాజోలు రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడిద కవీంద్ర, చిట్టినీడి లక్ష్మణరావులు అభినందించారు. రోటరీజోన్–4 పరిధిలో చెస్ పోటీల్లో విజేతగా నిలిచిన వెంకటరమణకు నరసాపురం క్లబ్ ప్రతినిధులు ప్రశంసాపత్రం, బంగారు పతకాన్ని అందజేశారు. సమాజ సేవల్లో నిమగ్నమైన రోటరీక్లబ్ సభ్యులకు స్పోర్ట్స్ నిర్వహించిన నరసాపురం రోటరీక్లబ్ నిర్వాహకులను అభినందించారు.

సంగమేశ్వర ఆలయ ఆవరణ అభివృద్ధి

ఎమ్మెల్సీ త్రిమూర్తులు చొరవతో సాధ్యం



ఆలయ ఆవరణలో మెరక పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద సంగమేశ్వరస్వామి ఆలయ ఆవరణ అభివృద్ధి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో సాధ్యమైంది. చుట్టూ ఆలయ భూమి ఆక్రమణకు గురైన నేపథ్యంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు సర్వేకు ఆదేశించారని, దీంతో షష్ఠి సమయానికి సుమారు 30 సెంట్ల భూమికి విముక్తి లభించిందని సంగమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ రామిశెట్టి శ్రీనివాసరావు, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. షష్ఠి ఉత్సవాల సమయానికి భూమి స్వాధీనం చేసుకోవడంతో ఉత్సవాల్లో జనం తాకిడికి అనుకూలంగా ఆ స్థలాన్ని రూ.2.50 లక్షల ఆలయ నిధులతో చదును చేయించే పనులను చేపట్టారు. ఆ పనులను ఆశీర్వాదం తదితరులు ఆదివారం పరిశీలించారు. ఇదిలా ఉండగా సోమవారం ఆలయం వద్ద షష్ఠి ఉత్సవాల ఏర్పాట్లను సహకార సంఘం చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, దేవస్థానం చైర్మన్ రామిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శోభారాణి పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు వీఆర్‌ఏలు, వీఏఏల ఆధ్వర్యంలో మండల గ్రామాల్లో టాం, టాంలు వేయించటం, బైక్‌లపై మైక్‌ల ద్వారా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంపై ఆదివారం గొల్లపాలెంలో ఏఓ అశోక్ మాట్లాడుతూ మండలంలోని 22 ఆర్‌బీకేల్లోనూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో కొద్దిగా తడిచిన ధాన్యాన్ని తేమ శాతం పేరుతో బయట మార్కెట్‌లో కొందరు దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వారి మాటలకు మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మద్దతు ధర 75 కేజీల బస్తా రూ.1637కి కొనుగోలు చేస్తూ వారం రోజుల వ్యవధిలో బ్యాంక్ ఖాతాల ద్వారా సొమ్ములు అందజేస్తున్నారన్నారు.

ఎక్స్‌లెన్సీ అవార్డు గ్రహీతలకు అభినందనలు

రావులపాలెం: రాష్ట్ర స్థాయి ఎక్స్‌లెన్సీ అవార్డులు పొందిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, ఉపాధ్యాయిని రజిని, విద్యార్థిని సూర్య తేజస్వినిలను కళాశాల సిబ్బంది, సహచర అధ్యాపకులు, విద్యార్థులు ఆదివారం అభినందించారు. ఈనెల 16న అనంతపురంలో జరిగిన అకడమిక్ ఫెస్టివల్ అవార్డుల ప్రదానంలో స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చప్పిడి కృష్ణ రాష్ట్రస్థాయి ఎక్సలెన్సీ అవార్డు, కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలు కె.రజిని రాష్ట్ర స్థాయి అవార్డు, విద్యార్థిని సూర్య తేజస్వినికి రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్న వారికి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

గ్రూప్స్ పరీక్షకు మాక్ టెస్ట్

అంబాజీపేట: గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలకు సంబంధించి అంబాజీపేట మండల ప్రజా పరిషత హైస్కూల్‌లో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘ అధ్యక్షుడు నందిక వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మాక్ టెస్ట్‌కు సంబంధించి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు ఆధ్వర్యంలో శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోకా రమాదేవి సౌజన్యంతో మాక్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. మాక్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. 100 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు.